సాక్షి
తూర్పుగోదావరి
శనివారం । 26 । ఏప్రిల్ । 2025



రూ.లక్ష విరాళం

గోకవరం: స్థానిక శ్రీ పర్వత వర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి సంగుల శివ (గోకవరం) శుక్రవారం రూ.లక్ష విరాళం అందజేశారు.




మాకు మా నాన్నే కావాలి!

'మమ్మల్ని మా నాన్నకు అప్పగించండి.. లేదంటే చంపేయండి. అమ్మకు అప్పగిస్తే చంపేస్తుంది' అంటూ ఇద్దరు చిన్నారులు అన్న మాటలు అందరి హృదయాలను కలచివేస్తున్నాయి.

10లో

డెల్టాలకు 4,500 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శుక్రవారం 4,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 600, మధ్య డెల్టాకు 900, పశ్చిమ డెల్టాకు 3 వేల క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 8.90 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

లోక్ అదాలత్ వాయిదా

- జూలై 5న నిర్వహణ
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): వచ్చే నెల 10న నిర్వహించ తలపెట్టిన జాతీయ లోక్ అదాలత్‌ను జూలై 5వ తేదీకి వాయిదా వేశారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత ఈ విషయం తెలిపారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ఎక్సైజ్ అధికారులతో జిల్లా న్యాయస్థానం ఆవరణలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, జూలై 5న జిల్లావ్యాప్తంగా జరగనున్న లోక్ అదాలత్‌లో అధిక మొత్తంలో రాజీ పడదగిన ఎక్సైజ్ కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఒకటో అదనపు సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి బి.పద్మ, తూర్పు గోదావరి, కాకినాడ, కోనసీమ, అల్లూరి సీతారామరాజు జిల్లాల ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు సీహెచ్ లావణ్య, ఎం.కృష్ణకుమారి, ఎస్‌కేడీవీ ప్రసాద్, పీఎస్ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

డీపీఆర్‌ఓగా బాలకృష్ణ



కలెక్టర్ ప్రశాంతిని మర్యాదపూర్వకంగా కలసిన డీపీఆర్‌ఓ బాలకృష్ణ

రాజమహేంద్రవరం సిటీ: జిల్లా పౌర సంబంధాల అధికారి(డీపీఆర్‌ఓ)గా వై.బాలకృష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం, కలెక్టర్ పి.ప్రశాంతిని ఆమె క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వానికి, పరిపాలనా యంత్రాంగానికి, మీడియాకు మధ్య వారధిగా డీపీఆర్‌ఓ కీలక పాత్ర పోషించాలని అన్నారు. బాలకృష్ణ ఏపీపీఎస్సీ ద్వారా ఎంపికై, జిల్లాలో నియమితులవడంపై అభినందనలు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను, ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకుని వెళ్లడంలో కీలక బాధ్యతలు నిర్వహించాలని సూచించారు. జిల్లా అధికారులతో సమన్వయం సాధించడం ద్వారా లక్ష్య సాధన సాధ్యమవుతుందన్నారు. నూతన డీపీఆర్‌ఓ బాలకృష్ణకు జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు, డీఆర్‌ఓ టి.సీతారామమూర్తి, కేఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.భాస్కరరెడ్డి, ట్రాన్స్‌కో ఎస్‌ఈ కె.తిలక్ కుమార్, జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి సీహెచ్ శ్రీనివాస్, డివిజనల్ పీఆర్‌ఓ ఎం.లక్ష్మణాచార్యులు తదితరులు అభినందించారు.

జలకళేనా..!



దేవరపల్లి మండలం పల్లంట్ల గ్రామంలో బోరు డ్రిల్లింగ్ (ఫైల్)

- రైతుల సాగునీటి కష్టాలు తీర్చేందుకు ఉద్దేశించిన పథకం
- బోరుతో పాటు, మోటారు ఉచితం
- వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరా సాగులోకి తెచ్చేందుకు కృషి
- కూటమి ప్రభుత్వం వచ్చాక ఆగిన వైఎస్సార్ జలకళ
- ఎప్పుడు ప్రారంభిస్తారన్న విషయమై స్పష్టత కరవు

సాక్షి, రాజమహేంద్రవరం: అన్నదాత ఇంట ఆనందం వెల్లివిరియాలంటే వ్యవసాయం పండగ కావాలి. ఇది జరగాలంటే రైతన్నల పొలాలకు తగినంత నీటి లభ్యత ఉండాలి. దీనిని దృష్టిలో ఉంచుకుని అన్నదాతల సాగునీటి కష్టాలకు చరమ గీతం పాడే సదుద్దేశంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గోదావరి కాలువల ద్వారా పంట పొలాలకు పుష్కలంగా నీరందించింది. అక్కడితో ఆగిపోకుండా మెట్ట ప్రాంత రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి కష్టాలను గుర్తించి, 2020లో వైఎస్సార్ జలకళ పేరిట మహత్తర పథకానికి శ్రీకారం చుట్టింది. దీని ద్వారా అర్హులైన రైతులకు పైసా ఖర్చు లేకుండా వారి పొలాల్లో ఉచితంగా బోర్లు వేయించింది. మోటార్లు అందజేసింది. బోరుకు కావాల్సిన పైపులు అమర్చింది. చివరకు విద్యుత్తు సదుపాయం కూడా కల్పించింది. తద్వారా రైతులకు సాగునీటి బెంగ లేకుండా పక్కా చర్యలు చేపట్టింది.

గత సార్వత్రిక ఎన్నికల్లో అధికార పగ్గాలు చేజిక్కించుకున్న కూటమి సర్కారు.. నాటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పథకాలను నిర్వీర్యం చేయడం.. పూర్తిగా నిలిపివేయడమే ధ్యేయంగా పాలన సాగిస్తోంది. ఇప్పటికే సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసింది. మద్యం విధానం, విద్యా వ్యవస్థల్లో మార్పులు చేపట్టింది. ఈ క్రమంలో వ్యవసాయ రంగంలో విప్లవాత్మకంగా రూపొందించిన వైఎస్సార్ జలకళ పథకాన్ని సైతం ఆపేసింది. తిరిగి ఎప్పుడు ప్రారంభిస్తారో స్పష్టత ఇవ్వడం లేదు. ఫలితంగా వేలాది మంది మెట్ట ప్రాంత రైతులు సాగునీటికి ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. కేవలం గత ప్రభుత్వానికి పేరు వస్తుందన్న తలంపుతో కూటమి సర్కార్ ఇలా వ్యవహరిస్తోందనే విమర్శలు వస్తున్నాయి. ఈ పథకాన్ని వెంటనే ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు. తన పరిధిలోకి వచ్చే ఈ పథకంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సైతం దృష్టి సారించకపోవడమేమిటని ప్రశ్నిస్తున్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో..

సన్నకారు రైతులు వ్యవసాయ బోర్లు వేసుకునేందుకు ఏటా రూ.లక్షల్లో వ్యయం చేసేవారు. బోరు తవ్వించాలంటే రెవెన్యూ, భూగర్భ జల శాఖ అధికారుల అనుమతులు తీసుకోవాలి. ఆ ప్రయత్నాల్లో రైతులు అనేక ఆపసోపాలు పడేవారు. వేలకు వేలు ఖర్చు పెట్టినా నీళ్లు పడతాయో లేదోననే భయంతో వెనకడుగు వేసేవారు. జియాలజిస్టు ఖర్చులు భరించలేక మిన్నకుండిపోయేవారు. ఈ క్రమంలో రైతులు అప్పుల పాలయ్యేవారు. ఇలా రైతులు పడుతున్న ఇబ్బందులకు చెక్ చెబుతూ వైఎస్సార్ జలకళ పథకానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 2023 డిసెంబర్ వరకూ ఈ పథకం నిరాటంకంగా సాగింది. జిల్లావ్యాప్తంగా 7 నియోజకవర్గాల్లో ఈ పథకం కింద 3,125 **బోర్లు వేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. బోర్లు అవసరమైన రైతుల నుంచి డ్వామా అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. జిల్లావ్యాప్తంగా ఆన్‌లైన్, సచివాలయాల ద్వారా సుమారు 4,670 దరఖాస్తులు అందాయి. వీటిలో 3,970 దరఖాస్తులకు ఆమోద ముద్ర వేశారు. వాటిని జిల్లా** నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ఏపీడీ లాగిన్‌కు పంపారు. ఏపీడీ జియాలజిస్టుల సర్వే కోసం పంపారు. డ్వామా ఏపీడీ నుంచి అందిన దరఖాస్తులకు సంబంధించిన సర్వే త్వరితగతిన పూర్తి చేసి, రిగ్ పనులు ప్రారంభించాలని నాటి ప్రభుత్వం ఆదేశించింది. అనంతరం 1,979 దరఖాస్తులను అర్హమైనవిగా గుర్తించి అంచనాలు రూపొందించారు. వాటిలో 1,944 దరఖాస్తులకు పరిపాలనా అనుమతులు మంజూరు చేశారు. గత ప్రభుత్వ హయాంలో 1,135 బోర్లు డ్రిల్లింగ్ చేశారు. మరో 809 బోర్లు తవ్వాల్సి ఉంది. 432 బోర్లకు విద్యుత్ కనెక్షన్లు కూడా ఇచ్చారు. 412 మోటార్లకు అంచనాలు రూపొందించారు. 315 మోటార్లకు పరిపాలనా అనుమతులు ఇవ్వగా.. 69 మోటార్లను రైతులకు ఉచితంగా అందజేశారు. ఒక్కో బోరుకు రూ.70 వేల నుంచి రూ.లక్ష వరకూ ఖర్చు చేశారు.

తొలుత ఐదెకరాల లోపు మెట్ట, రెండున్నర ఎకరాల లోపు మాగాణి ఉన్న చిన్న, సన్నకారు రైతులకే బోర్లు వేయాలని నిర్ణయించారు. అయితే, మరింత మంది రైతులకు మేలు చేయాలన్న సంకల్పంతో వైఎస్సార్ జలకళ పథకం నిబంధనలను అప్పటి



రైతులకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉంచిన పైపులు (ఫైల్)

ప్రభుత్వం సరళతరం చేసింది. విస్తీర్ణంతో సంబంధం లేకుండా వ్యవసాయ భూమి ఉన్న ప్రతి రైతూ అర్హుడేనని స్పష్టం చేసింది. భూగర్భ జలాలు అందుబాటులో ఉన్న ప్రతి రైతు పొలంలో ఉచితంగా బోరు వేసి సాగునీటికి భరోసా కల్పించాల్సిందిగా నిబంధనలు సవరించారు. చిన్న, సన్నకారు రైతులకు మాత్రం బోరుతో పాటు ఉచితంగా మోటారు కూడా అందజేయాలని, ఐదెకరాలు పైన ఉన్న రైతులకు కేవలం బోర్లు మాత్రమే వేయాలని నిర్ణయించారు. తద్వారా సన్న, చిన్నకారు రైతులతో పాటు మధ్యతరగతి, పెద్ద రైతులకు సైతం లబ్ధి చేకూరింది. 2024లో సార్వత్రిక ఎన్నికల వేడి మొదలవడం.. కోడ్ అమలులోకి రావడంతో ఈ పథకంలో ఆశించిన పురోగతి కనిపించలేదు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక పూర్తిగా నిలిపివేశారు. అప్పటి నుంచీ ఈ పథకానికి దరఖాస్తు చేసుకున్న వందలాది మంది రైతులు ఉచిత బోర్ల కోసం ఎదురు చూస్తూనే ఉన్నారు.

గత ప్రభుత్వ హయాంలో పథకం అమలు ఇలా..

నియోజకవర్గం	అనుమతి పొందినవి	డ్రిల్లింగ్ చేసినవి	అనుమతి రావాల్సినవి
గోపాలపురం	268	158	110
కొవ్వూరు	87	83	4
నిడదవోలు	287	267	20
అనపర్తి	525	291	234
గోకవరం	401	153	248
రాజమహేంద్రవరం రూరల్	9	9	0
రాజానగరం	367	174	193

'వర్జీనియా' రైతులకు ఉపశమనం

- మూడేళ్లకు లైసెన్స్ పునరుద్ధరణ
- వచ్చే పంట కాలం నుంచి అమలు
- 83,500 మందికి లబ్ధి
- కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ గెజిట్ ప్రచురణ



జీఎల్‌కే ప్రసాద్

దేవరపల్లి: వర్జీనియా పొగాకు రైతులకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ తీపి కబురు చెప్పింది. పొగాకు సాగు చేయాలంటే రైతు పేరిట రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, బ్యారన్ నిర్వహణకు పొగాకు బోర్డు నుంచి లైసెన్స్ తీసుకోవలసి ఉంది. ఏటా పంట వేయడానికి ముందు అక్టోబర్, నవంబర్ నెలల్లో పొగాకు బోర్డు కార్యాలయంలో వీటిని పునరుద్ధరించుకోవలసి ఉంది. దీని నిమిత్తం రైతులు బోర్డు నిర్ణయించిన రుసుం చెల్లించాల్సి ఉంటుంది. రైతులకు భారంగా మారిన ఈ విధానాన్ని రద్దు చేయాలని, మూడేళ్లకోసారి పునరుద్ధరించుకునేలా అవకాశం ఇవ్వాలని రైతు సంఘాలు చాలా కాలంగా కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నాయి.

దీనిని పరిగణనలోకి తీసుకుని, మూడేళ్ల వరకూ చెల్లుబాటయ్యేలా ఈ నెల 22న కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ గెజిట్ ప్రచురించిందని పొగాకు బోర్డు రీజినల్ మేనేజర్ (రాజమహేంద్రవరం) జీఎల్‌కే ప్రసాద్ శుక్రవారం తెలిపారు. మన రాష్ట్రంలో 2025-26 పంట కాలం నుంచి అమలులోకి వస్తుందని పేర్కొన్నారు. దీనివలన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, బ్యారన్ నిర్వహణ లైసెన్స్ పునరుద్ధరణ మూడేళ్ల పాటు చెల్లుబాటు అవుతుందని వివరించారు. దీనికి సంబంధించిన ఉత్తర్వులు త్వరలో గుంటూరులోని పొగాకు బోర్డు కార్యాలయానికి అందనున్నాయని తెలిపారు. ఈ సవరణ ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల్లోని దాదాపు 91 వేల బ్యారన్లకు చెందిన 83,500 మంది రైతులకు ఎంతో ఉపయోగపడుతుంది. రాజమహేంద్రవరం రీజియన్‌లోని ఐదు వేలం కేంద్రాల పరిధిలో 14,861 బ్యారన్లకు సంబంధించిన 12,861 మంది రైతులకు దీని ద్వారా ఉపశమనం కలగనుంది.

ప్రధానికి షర్మిల వెంటనే క్షమాపణ చెప్పాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నిర్మలా కిషోర్

రాజమహేంద్రవరం సిటీ: జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్ర దాడి ఘటనను రాజకీయం చేయడం పీసీసీ అధ్యక్షురాలు షర్మిలకు తగదని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు నిర్మలా కిషోర్ అన్నారు. రాజమహేంద్రవరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. షర్మిల వెంటనే ప్రధానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. జరిగిన ఘటన చాలా హేయమైనదని, దీనిని దేశవ్యాప్తంగా ప్రజలందరూ ముక్తకంఠంతో ఖండిస్తున్నారని అన్నారు. ఈ ఘటనను కూడా రాజకీయంగా ఉపయోగించుకోవాలని, దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని కాంగ్రెస్ పార్టీ ప్రయత్నించడం దారుణమని మండిపడ్డారు. మళ్లీ ఇటువంటి వ్యాఖ్యలు చేస్తే షర్మిలకు తగిన గుణపాఠం చెప్పడానికి మహిళా మోర్చా సిద్ధంగా ఉంటుందని నిర్మలా కిషోర్ హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి ప్రసన్న, జిల్లా అధ్యక్షురాలు మద్దిపాటి రజని పాల్గొన్నారు.

పాలిసెట్ హాల్ టికెట్ల విడుదల

రాజమహేంద్రవరం రూరల్: పాలిటెక్నిక్ కోర్సులలో ప్రవేశానికి నిర్వహించే ఏపీ పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (పాలిసెట్) హాల్ టికెట్లు విడుదలయ్యాయని బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ వి.నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలిసెట్ ఈ నెల 30న జరుగుతుందన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తమ హాల్ టికెట్లను పాలిసెట్ ఏపీ.ఎస్‌బీటీ.ఐఎన్ వెబ్‌సైట్ ద్వారా ముందుగానే డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. హాల్ టికెట్లు ఆన్‌లైన్ మోడ్‌లో మాత్రమే అందుబాటులో ఉంటాయన్నారు. పోస్టు, ఇతర ఆఫ్‌లైన్ పద్ధతుల్లో పంపరని స్పష్టం చేశారు. మరింత సమాచారం కోసం వెబ్‌సైట్‌ను సందర్శించాలని లేదా సహాయ కేంద్రమైన తమ కళాశాలలో సంప్రదించాలని నాగేశ్వరరావు సూచించారు.

ఉగ్రవాదులను ఉరి తీయాలి

- మతసామరస్యాన్ని కాపాడాలి
- పర్యాటకులపై ఉగ్ర దాడికి ముస్లిం మహిళా జేఏసీ ఖండన
- కొవ్వొత్తులతో ర్యాలీ



పహల్‌గాం ఉగ్ర దాడిపై ఆజాద్ చౌక్‌లో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న ముస్లిం మహిళలు

సాక్షి, రాజమహేంద్రవరం: జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాం వద్ద పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడిని నిరసిస్తూ ముస్లిం ఐక్య వేదిక రాజమహేంద్రవరం శాఖ (జేఏసీ) ఆధ్వర్యాన మహిళలు శుక్రవారం రాత్రి పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక జాంపేటలోని ఆజాద్ చౌక్ వద్ద ముస్లిం జేఏసీ ఆంధ్రప్రదేశ్ కన్వీనర్ ఎండీ హబీబుల్లా ఖాన్ నాయకత్వంలో ముస్లిం మహిళలు కొవ్వొత్తులతో ఈ ర్యాలీ నిర్వహించారు. 'ఉగ్రవాదాన్ని అరికట్టాలి, నిందితులను కఠినంగా శిక్షించాలి, హిందూ ముస్లిం భాయీ భాయ్, మేరా భారత్ మహాన్' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ముస్లిం మహిళలు మాట్లాడుతూ, ఉగ్రవాదుల చేతిలో అసువులు బాసిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని కోరారు. అమాయక పర్యాటకులను ఉగ్రవాదులు హతమార్చారని, ప్రతి పౌరుడూ ఈ దాడిని ఖండించాలని అన్నారు. దేశంలోని ఉగ్రవాదులను అణచివేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని, తక్షణమే ఉగ్రవాద నిర్మూలనకు కేంద్రం మరిన్ని కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 370 ఆర్టికల్‌ను ప్రధాని నరేంద్ర మోదీ రద్దు చేసి కశ్మీర్‌ను అల్లకల్లోలం చేశారని అన్నారు. కశ్మీర్ ఉగ్రవా దాడికి కేంద్రం జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. హిందూ ముస్లింలు ఐక్యంగా జీవించే లౌకిక దేశం భారత్ అని అన్నారు. కొన్ని రాజకీయ పార్టీలు మతాల మధ్య చిచ్చు రేపి, దేశంలో అల్లకల్లోలం సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఉగ్రవాదాన్ని ముస్లింలు ప్రేరేపిస్తున్నారంటూ బీజేపీ ఆరోపిస్తోందని, కానీ, పర్యాటకులకు అండగా మహమ్మద్ హుస్సేన్ అనే గుర్రపు స్వారీ చేసే వ్యక్తి ఉగ్రవాదులను అడ్డుకొని, అనేక మంది ప్రాణాలు కాపాడి, దేశం కోసం ప్రాణాలర్పించి, దేశ సమగ్రతను చాటి చెప్పాడని గుర్తు చేశారు. ఈ ర్యాలీలో ముస్లిం మహిళా నాయకులు ఆయేషా, షావు, హీర, షాహిన, ముంతాజ్, ఫర్హీద్, షబ్నం తదితరులు పాల్గొన్నారు.

అల కాంచీపురములో..

- అన్నవరానికి అరుదైన గౌరవం
- కంచి పీఠం ఉత్తరాధికారిగా గ్రామానికి చెందిన ద్రావిడ్
- 71వ పీఠాధిపతిగా ఎంపిక
- పీఠంతో అన్నవరం దేవస్థానానికి విడదీయలేని బంధం

అన్నవరం: సాక్షాత్తూ ఆ కైలాస శంకరుడే.. ఆదిశంకరాచార్యుడిగా అవతరించి.. అవైదిక మతాల నుంచి సనాతన ధర్మాన్ని పరిరక్షించి.. సర్వజ్ఞ పీఠాన్ని అధిరోహించి.. భారత దేశం నలు చెరగులా నాలుగు ఆమ్నాయ పీఠాలను స్థాపించి.. దక్షిణాదిన తాను స్వయంగా ఆధిపత్యం వహించిన సుప్రసిద్ధ పీఠం.. కంచి కామకోటి పీఠం. అటువంటి విశిష్ట పీఠానికి ఉత్తరాధికారిగా గోదారి గట్టుపై వెలసిన దివ్యక్షేత్రం అన్నవరం గ్రామానికి చెందిన ఓ నవ యువకుడు ఎంపికవడం ఈ ప్రాంత ప్రజల్లో ఆనందాన్ని నింపుతోంది. అన్నవరానికి చెందిన చతుర్వేద పారంగతుడు దుడ్డు సత్య వేంకట సూర్య సుబ్రహ్మణ్య గణేష్ శర్మ ద్రావిడ్‌ను కంచి కామకోటి పీఠం ఉత్తరాధికారిగా పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామీజీ ఎంపిక చేశారు. ద్రావిడ్ ఈ నెల 30న అక్షయ తృతీయ పర్వదినం సందర్భంగా స్వామీజీ చేతుల మీదుగా సన్యాస దీక్ష స్వీకరిస్తారు. అనంతరం ఆయనను స్వామీజీ తన శిష్యునిగా స్వీకరిస్తారు. ఈ నేపథ్యంలో కంచి పీఠంతో అన్నవరం దేవస్థానానికి శతాబ్దానికి పైబడి కొనసాగుతున్న అనుబంధం, కంచి పీఠాధిపతులు గతంలో ఇక్కడకు పలుమార్లు విచ్చేసి, మార్గనిర్దేశం చేయడం వంటి అంశాలను పలువురు గుర్తుకు తెచ్చుకుంటున్నారు. ద్రావిడ్ ఎంపికతో కంచి పీఠానికి, అన్నవరం



కంచి పీఠం ఉత్తరాధికారి కానున్న గణేష్ శర్మ

అన్నవరానికి చెందిన దుడ్డు సత్య వేంకట సూర్య సుబ్రహ్మణ్య గణేష్ శర్మ ద్రావిడ్ కంచి పీఠం ఉత్తరాధికారిగా, భవిష్యత్తులో 71వ పీఠాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం అన్నవరం దేవస్థానంతో పీఠం అనుబంధం మరింత బలోపేతమవుతుందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

దేవస్థానానికి అనుబంధం మరింత దృఢపడుతుందని, ఇదంతా సత్యదేవుని దయ, పీఠాధిపతులకు ఈ క్షేత్రంపై గల అభిమానమేనని పలువురు అభిప్రాయపడుతున్నారు.


కంచితో మంచి అనుబంధం

- వీర వేంకట సత్యనారాయణ స్వామి స్వయంభువుగా వెలసిన అన్నవరం దేవస్థానానికి, కంచి కామకోటి పీఠానికి ఎప్పటి నుంచో అనుబంధం ఉంది. రత్నగిరిపై సత్యదేవుడు ఆవిర్భవించి 134 సంవత్సరాలు పూర్తి కాగా అప్పటి నుంచీ దేవస్థానంలో వైదిక కార్యక్రమాల రూపకల్పన, ప్రతి కీలక పరిణామాల్లో కంచి కామకోటి పీఠాధిపతులు సూచనలు అందిస్తున్నారు. వారు భక్తులకు, దేవస్థానం అధికారులకు ఇస్తున్న సూచనలు, అనుగ్రహ భాషణలు ఎంతో ప్రాముఖ్యత సంతరించుకున్నాయి.
- నడిచే దేవుడిగా పేరొందిన కంచి పీఠం 68వ అధిపతి శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి మహాస్వామి సుమారు 50 ఏళ్ల క్రితం కంచి నుంచి పాదయాత్ర చేస్తూ అన్నవరం వచ్చారు. ఆయన కూడా వందల సంఖ్యలో భక్తులతో పాటు ఏనుగులు, గుర్రాలు, ఆవులు కూడా నడుస్తూ వచ్చాయి. అన్నవరంలో ఆయన మూడు రోజులు బస చేశారు. స్థానిక సుబ్రహ్మణ్యస్వామి వారి ఆలయంలో పీఠం ఏర్పాటు చేసి, స్వామీజీ పూజలు చేశారు. ఆ సమయంలో సత్యదేవుని ఆలయానికి వచ్చి, దేవస్థానంలో అనేక వైదిక కార్యక్రమాల గురించి మార్గనిర్దేశం చేశారు. పలువురు పండితులకు అన్నవరంలో ఆయన చేతుల మీదుగా సన్మానం చేశారు. స్వామీజీ అన్నవరం నుంచి పాదయాత్రగా తుని వెళ్తూ, మార్గం మధ్యలో ఎర్రకోనేరు వద్ద సూర్యాస్తమయం కావడంతో అక్కడ సంధ్యావందనానికి ఆగిపోయారని నాడు స్వామీజీతో యాత్రలో పాల్గొన్న అన్నవరం దేవస్థానం వైదిక కార్యక్రమాల పర్యవేక్షకుడు నాగాభట్ల కామేశ్వరశర్మ తెలిపారు.



చంద్రశేఖరేంద్ర సరస్వతి మహాస్వామి

- కంచి పీఠం 70వ పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామీజీ కూడా జిల్లా యాత్రకు వచ్చిన ప్రతిసారీ సత్యదేవుని దర్శించుకున్నారు. 2023లో స్వామీజీ కాకినాడలోని ప్రముఖ ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు గోశాలలో చాతుర్మాస దీక్ష చేపట్టారు. అంతకు ముందు పెద్దాపురంలో శ్రీ లలితా రైస్ ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్లలో ఒకరైన మట్టే శ్రీనివాస్ నిర్వహించిన అమ్మవారి లక్ష కుంకుమార్చనల్లో పాల్గొన్నారు. ఆ సమయంలో శ్రీలలితా ఇండస్ట్రీస్ ఎండీ మట్టే సత్యప్రసాద్ సత్యదేవునికి చేయించిన వజ్ర కిరీటాన్ని స్వామీజీ చేతుల మీదుగా దేవస్థానానికి అందజేశారు. ఆ తరువాత స్వామీజీ దేవస్థానానికి వచ్చి, కొండ దిగువన పంపా సత్రంలో పీఠం ఏర్పాటు చేసి, ప్రతి రోజూ పూజలు చేసేవారు.




సత్యదేవుని సన్నిధిలో ప్రస్తుత కంచి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామీజీ

- కంచి కామకోటి పీఠం 69వ పీఠాధిపతి శ్రీ జయేంద్ర సరస్వతి స్వామీజీ కూడా అన్నవరం దేవస్థానానికి చాలాసార్లు వచ్చారు. చివరిగా ఆయన 2012 మార్చిలో అన్నవరం దేవస్థానానికి వచ్చి, రత్నగిరిపై సత్యదేవుని నూతనాలయ కలశ ప్రతిష్ఠ నిర్వహించారు. నూతనాలయంలో స్వామి, అమ్మవార్ల తొలి దర్శనం చేసుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఆయన చేతుల మీదుగా ప్రారంభమైన నూతన ఆలయం అన్నివిధాలా దినదిన ప్రవర్ధమానమవుతుండగా, సత్యదేవుని ఖ్యాతి ప్రపంచవ్యాప్తంగా విస్తరించడం విశేషం.



సత్యదేవుని నూతన ఆలయ కలశ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న జయేంద్ర సరస్వతి స్వామి

మా అందరి పూర్వ జన్మ సుకృతం



మేము తొమ్మిది మంది అన్నదమ్ములం. ఆరుగురు చెల్లెళ్లు. గణేష్ శర్మ మా రెండో సోదరి భళ్లమూడి భాస్కరం, సూర్యనారాయణ దంపతుల కుమార్తె కొడుకు. అతడి తండ్రి ధన్వంతరి, తల్లి మంగాదేవి. గణేష్‌ను నా చేతుల మీద పెంచాను. ద్వారకా తిరుమలలో ఆగమ శాస్త్రాలు అభ్యసించి, పరీక్షలో గోల్డ్ మెడల్ పొందాడు. అప్పుడే శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామీజీ అతడి విద్వత్తు చూసి కంచి పీఠానికి తీసుకుని వెళ్లి, చతుర్వేదాలు, ఉపనిషత్తులు నేర్పించారు. గణేష్ శర్మకు ఈ గౌరవం దక్కడం మా పూర్వజన్మ సుకృతం.

– నాగాభట్ల కామేశ్వరశర్మ, వైదిక కార్యక్రమాల పర్యవేక్షకుడు, అన్నవరం దేవస్థానం

పారిశ్రామిక పార్కులో సైట్ బుకింగులు ప్రారంభం



ఇండస్ట్రియల్ పార్కులో పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజానగరం: కలవచర్లలో 104 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తున్న ఇండస్ట్రియల్ పార్కులో పరిశ్రమల ఏర్పాటుకు సైట్ బుకింగ్ చేసుకునే అవకాశాన్ని ఔత్సాహికులకు కల్పిస్తున్నామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. సంబంధిత అధికారులతో కలసి శుక్రవారం ఆ ప్రాంతాన్ని సందర్శించిన ఆమె పరిశ్రమల ఏర్పాటుకు అక్కడ జరుగుతున్న మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ఇక్కడ 390 సైట్స్ బుక్ చేసుకునే అవకాశం ఉందన్నారు. రిజర్వేషన్లను అనుసరించి సైట్స్ కేటాయిస్తారని తెలిపారు. ఇప్పటికే వేమగిరి, జేగురుపాడుకు చెందిన 197 మందికి అనుమతులు ఇచ్చామని సంబంధిత అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. కార్యక్రమంలో జోనల్ మేనేజర్ రమణారెడ్డి, పరిశ్రమల అధికారి శ్రీవనిధర్ రామన్, విద్యుత్ శాఖ అధికారి కె.తిలక్‌కుమార్, ఏడీ ప్రదీప్‌కుమార్, తహసీల్దార్ జీఏఎల్ఎస్ దేవి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కోడి పందేలాడుతున్న 26 మంది అరెస్టు

రూ.96,770 నగదు, 25 సెల్‌ఫోన్లు స్వాధీనం

కోరుకొండ: మండలంలోని మధురపూడి-మిర్తిపాడు మధ్యలోని తోటల్లో కోడి పందేలు నిర్వహిస్తున్న 26 మందిని శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కోరుకొండ సీఐ సత్యకిషోర్ ఆధ్వర్యంలో ఎస్సై టి. శ్యామ్‌సుందర్ సిబ్బందితో కలిసి ఆకస్మికంగా దాడిచేశారు. అక్కడ కోడి పందేలు నిర్వహిస్తున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. వారినుంచి రూ.96,770 నగదు, 25 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. 3 కార్లు, 20 మోటార్‌సైకిళ్లు సీజ్ చేశారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తుచేస్తున్నట్టు ఎస్సై శ్యామ్‌సుందర్ తెలిపారు.

28న నిధి ఆప్‌కే నికట్

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక ఈపీఎఫ్‌వో ప్రాంతీయ కార్యాలయం పరిధిలో ఈ నెల 28వ తేదీ ఉదయం 9.00 గంటల నుంచి నిధి ఆప్‌కే నికట్-డిస్ట్రిక్ట్ ఔట్‌రీచ్ ప్రోగ్రామ్ నిర్వహిస్తామని అసిస్టెంట్ పీఎఫ్ కమిషనర్ రాధానాథ్ పట్నాయక్ ప్రకటనలో తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కేశవరం శ్రీసర్వారాయ సుగర్స్ లిమిటెడ్ బాట్లింగ్ యూనిట్‌లోను, కాకినాడ నారాయణ ఎడ్యుకేషనల్ సొసైటీలోను, కోనసీమ జిల్లాలో ఐ.పోలవరం మండలం కొమరగిరి పీఏసీఎస్(సొసైటీ)లోను, ఏలూరు జిల్లాలో ఏలూరు డీసీఎంఎస్ కాన్ఫరెన్స్ హాల్‌లోను, పశ్చిమగోదావరి జిల్లా ఉండిమండలం పెదపుల్లేరు గ్రామంలో ది పెదపుల్లేరు లార్జ్ సైజ్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్‌లోను, అల్లూరిసీతారామరాజు జిల్లా వై.రామవరం మండలంలోని యర్రంరెడ్డిపాలెం సచివాలయంలోను, గంగవరం మండలంలో మోహనపురం సచివాలయంలోను, మారేడుమిల్లి గ్రామపంచాయతీలోను డిస్ట్రిక్ట్ ఔట్‌రీచ్ ప్రోగ్రామ్ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం పింఛనుదారుల సేవలు-1 నేపథ్యంలో నిర్వహిస్తారన్నారు. సభ్యుల పెన్షన్, వితంతు పెన్షన్, అనాథ పెన్షన్, దివ్యాంగుల పెన్షన్‌పై అవగాహన కల్పిస్తారన్నారు. పీఎఫ్ సభ్యులు, పింఛనుదారులు, ఎస్టాబ్లిష్మెంట్‌లు, ఈ ప్రోగ్రాంను వినియోగించుకోవాలన్నారు. డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ సమర్పించడానికి ఈ క్యాంపును సందర్శించవచ్చన్నారు.

రిటైర్డ్ ఉద్యోగిని బెదిరించి రూ.30 లక్షలు స్వాహా

కొత్తపేట: సీబీఐ అరెస్టు వారెంట్ ఉందని ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగిని ఫోన్‌లో బెదిరించి బ్యాంక్ అక్కౌంట్ ద్వారా రూ.30 లక్షలు డ్రా చేయించుకున్న గుర్తు తెలియని వ్యక్తి ఉదంతమిది. కొత్తపేట ఎస్సై జీ సురేంద్ర శుక్రవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సోషల్ వెల్ఫేర్ హాస్టల్ ఉద్యోగిగా పనిచేసి రిటైర్ అయిన కొయ్య సత్యవతి, డీఆర్‌డీఏ ఉద్యోగిగా పనిచేసి రిటైర్ అయిన శ్రీనివాస్ దంపతులు కొత్తపేట న్యూ బ్యాంక్ కాలనీలో నివాసం ఉంటున్నారు. ఈ నెల 16 నుంచి సత్యవతి ఫోన్‌కు గుర్తు తెలియని వ్యక్తి కొన్ని కాల్స్ చేసి నీపై సీబీఐ అరెస్ట్ వారెంట్ ఉందని బెదిరించాడు. అలా తరచూ ఫోన్ చేసి బెదిరిస్తూ రూ.30 లక్షలు ఇవ్వమని డిమాండ్ చేశాడు. ఆ డబ్బు పంపిస్తే అరెస్టు వారెంట్ లేకుండా చేస్తామని నమ్మించాడు. దీంతో భయపడిన సత్యవతి తన బ్యాంక్ అకౌంట్ నుంచి ఆర్‌టీజీఎస్ ద్వారా రూ.30,00,100 ట్రాన్స్ఫర్ చేశారు. తర్వాత వారి ఫోన్లు పనిచేయకపోవడంతో ఈ విషయం ఆమె తన కుమారునికి చెప్పగా వెంటనే పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు ఇవ్వమని సూచించారు. ఆ మేరకు బాధితురాలు సత్యవతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ జీ సురేంద్ర తెలిపారు.

మద్యం తాగి బైక్ నడిపిన వారికి జైలు

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసుల్లో ఒకరికి ఐదురోజుల జైలు, 16 మందికి రెండు రోజుల చొప్పున జైలు, 11 మందికి జరిమానా విధిస్తూ కాకినాడ మూడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ డి.శ్రీదేవి తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్-1,2 పోలీసు స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. శుక్రవారం కోర్టులో 28 మందిని హాజరుపర్చగా వారికి పై విధంగా జైలు, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

మాకు మా నాన్నే కావాలి!

- అమ్మ చెంతకు వెళ్లం
- లేకుంటే చంపేయండి
- ఇద్దరు చిన్నారుల వేదన

రాజానగరం: 'మా అమ్మ వద్దకు వెళ్లం, మమ్మల్ని మా నాన్నకు అప్పగించండి.. లేదంటే చంపేయండి. అమ్మకు అప్పగిస్తే చంపేస్తుంది' అంటూ రోదిస్తూ ఇద్దరు చిన్నారులు అంటున్న మాటలు అందరి హృదయాలను కలచివేస్తున్నాయి. నవమాసాలు మోసి, జన్మనిచ్చిన తల్లి వివాహేతర సంబంధంతో భర్తను వదిలేసి, ప్రియుడితో ఉంటోంది. ఆ ప్రియుడు ఆమె పిల్లలతో చాకిరీ చేయించుకుంటూ, ఇష్టానుసారం కొడుతున్నా ఆ తల్లి హృదయం చలించడం లేదు. కనీసం ఆ తల్లిని కన్న తల్లి కూడా చోద్యం చూస్తూ కూతురి వివాహేతర సంబంధాన్ని వెనకేసుకొస్తున్న నేపథ్యంలో ఆ చిన్నారులు విసిగిపోయారు. పై విధంగా తమ నిర్ణయాన్ని వెల్లడించారు. రాజానగరం పోలీసు స్టేషన్ పరిధిలోని కొంతమూరులో జరిగిన ఈ సంఘటన వివరాలివీ..

కొంతమూరు చెంచు కాలనీలో ఉంటున్న అన్నెపు ధనలక్ష్మి, జయరామ్ దంపతులకు ఇద్దరు సంతానం. ప్రస్తుతం వీరిద్దరూ రాజమహేంద్రవరం ఆర్యాపురంలోని ఒక స్కూల్‌లో 4, 2 తరగతులు చదువుతున్నారు.

పెయింటర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న జయరామ్‌కు భార్య, పిల్లలంటే అమితమైన ప్రేమాభిమానాలున్నాయి. ధనలక్ష్మి ఒక కర్రీ పాయింట్‌లో పని చేస్తూండగా మండపల్లి ప్రవీణ్ కుమార్‌తో పరిచయం ఏర్పడింది. క్రమేపీ అతడితో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ క్రమంలో భర్త, పిల్లలను పట్టించుకునేది కాదు. ఆమె ప్రవర్తనను సరి చేయాల్సిన తల్లి తులసమ్మ కూతురుకు వంత పాడి, అల్లుడు జయరామ్‌ను బయటకు పంపించేందుకు సాయపడింది.



సుమారు ఏడాది నుంచి ప్రియుడితో కలసి ఉంటున్న ధనలక్ష్మి ఎదుటనే ఆ ఇద్దరు పిల్లలతో ఆమె ప్రియుడు సేవలు చేయించుకునేవాడు. చెప్పినట్టు చేయకపోతే కొట్టేవాడు. ఈ క్రమంలో జనవరి 25న బెల్టుతో ఇష్టానుసారం కొట్టడంతో చుట్టుపక్కల వారి ద్వారా విషయం తెలుసుకుని మేనమామ పాలవలస బాలమణికంఠ అక్కడకు వెళ్లి, ఆ ఇద్దరు పిల్లలను తన ఇంటికి తీసుకెళ్లాడు. ముందుగా రాజానగరం పోలీసులకు దీనిపై ఫిర్యాదు చేసి, రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లి చికిత్స చేయించాడు. అప్పటి నుంచీ వారిని తన ఇద్దరు పిల్లలతో సమానంగా చూసుకుంటున్నాడు. అయినప్పటికీ ధనలక్ష్మి పిల్లల గురించి పట్టించుకోకపోగా, వారి సంరక్షణ పేరుతో భర్త నుంచి నెలనెలా రూ.10 వేలు వసూలు చేస్తోంది. పిల్లల చదువులకు ఒక్క రూపాయి కూడా వినియోగించకపోవడంతో స్కూలు ఫీజులు రూ.38 వేల వరకూ పెరిగిపోయాయి.

ఈ నేపథ్యంలో పిల్లల మేనమామ మణికంఠ శుక్రవారం రాజానగరం పోలీసులను మరోసారి ఆశ్రయించడంతో ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పిల్లలు తమ తండ్రి వద్దకు వెళ్లిపోతామంటున్నారని ఈ సందర్భంగా మణికంఠ చెప్పాడు. అందుకు తమ బావ కూడా సిద్ధంగానే ఉన్నారని, అయితే అది అధికారికంగా జరగాలని కోరుతున్నాడని అన్నాడు. పోలీసులు, చైల్డ్ వెల్ఫేర్ సంస్థ సమక్షంలో వారిని తండ్రికి అప్పగిస్తేనే వారి భవిష్యత్తు బాగుంటుందన్నాడు.




బెల్టుతో కొట్టడంతో పిల్లల శరీరాలపై ఏర్పడిన గాయాలు

> **చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సమక్షంలో నిర్ణయం తీసుకుంటాం**
>
> తండ్రి శ్రీకాకుళంలో ఉంటున్నాడు. అతనికి కబురు చేశాం. రెండు రోజులలో వస్తాడు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సమక్షంలో తల్లిదండ్రులిద్దరినీ పెట్టి, పిల్లల వయస్సును బట్టి వారు ఎవరి వద్ద ఉండాలనుకుంటున్నారో నిర్ణయం తీసుకుంటాం. లేకుంటే హోమ్‌కు అప్పగిస్తాం.
>
> – నారాయణమ్మ, ఎస్సై, రాజానగరం

దారి దోపిడీ కేసులో నలుగురి అరెస్టు



నిందితులను అరెస్టు చేస్తున్న పోలీసులు

కోటనందూరు: దారి దోపిడీ కేసులో నలుగురు యువకులను అరెస్టు చేశామని స్థానిక ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు. వివరాల్లోకెళితే.. రాజమహేంద్రవరానికి చెందిన అల్లాడి నాగేంద్రసాయి, గాలంకి కిరణ్‌బాబు లంబసింగి పర్యటనకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఈ నెల 22న తెల్లవారుజాయు 2 గంటల సమయంలో తుని-నర్సీపట్నం రోడ్డులో మండలంలోని కాకరాపల్లి స్పైసీ రెస్టారెంట్ ఎదురుగా వచ్చేసరికి గుర్తు తెలియని ఆరుగురు యువకులు రెండు స్కూటీలపై వచ్చి అడ్డగించారు. ఆరుగురులో ఒకరు వీరిని క్రికెట్ బ్యాట్‌తో బెదిరించగా మరొకరు వీరిని చెంపలపై కొట్టారు. మరొక వ్యక్తి న్యూస్ రిపోర్టర్‌గా చెప్పి ఫొటోలు తీశాడు. మిగిలివారు బాధితుల నుంచి బలవంతంగా పల్సర్ బైక్, రెండు సెల్‌ఫోన్లు, దుస్తుల బ్యాగు, రూ.1,400 నగదు దోచుకొని బెదిరించి పారిపోయారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం అనకాపల్లి జిల్లా నాతవరం మండలం గాంధీనగరం, తాండవ జంక్షన్‌ల మధ్య సమావేశమై దొంగిలించిన బైకును అమ్మి గంజాయి కొనుగోలు చేసేందుకు పన్నాగం పన్నుతున్నట్లు అందుకున్న సమాచారంతో తుని రూరల్ సీఐ చెన్నకేశవరావు, ఎస్సై రామకృష్ణ సిబ్బందితో దాడి చేశారు. పెట్టం కామరాజు అలియాస్ వైస్‌షాప్‌నాని, గూటూరి సాయిదుర్గాప్రసాద్, సంగు నాగవెంకట భవానీ కుమార్, చింతా పవణ్‌కళ్యాణ్‌లను అరెస్టు చేశారు. చల్లా నాగశివమణికంఠ, ఏనుగుపల్లి రాజు పరారీలో ఉన్నారు. వీరంతా కాకినాడ పట్టణానికి చెందిన వారుగా గుర్తించారు.

విద్యుత్ ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలి

- ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు
- ఘనంగా యూనియన్ నూతన జెండా ఆవిష్కరణ, చిహ్నం టవర్ ప్రారంభం

రాజమహేంద్రవరం రూరల్: విద్యుత్‌శాఖలో పెండింగ్‌లో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలతో కూడిన న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఆంధ్ర ప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సానా కృష్ణయ్య, ఎంవీ గోపాలరావు డిమాండ్ చేశారు. శుక్రవారం బొమ్మూరులోని 220 కేవీ సబ్‌స్టేషన్ వద్ద ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (రి.నెం.1104) 75 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ప్లాటినం జూబ్లీ వేడుకలు ఓఅండ్ ఎం ఏపీ ట్రాన్స్‌కో రాజమహేంద్రవరం ప్రాంతీయశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు సానా కృష్ణయ్య నూతనజెండాను ఆవిష్కరించగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంవి.గోపాలరావు యూనియన్ చిహ్నం టవర్‌ను ప్రారంభించారు. కృష్ణయ్య, గోపాలరావు మాట్లాడుతూ పార్టీలు, కులాలకు అతీతంగా కార్మికులతో నడుస్తున్న ఏకైక యూనియన్ ఏపీఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ 1104 మాత్రమేనన్నారు. 75 సంవత్సరాలుగా కార్మికుల హక్కుల కోసం యూనియన్ చేసిన పోరాటాలను వారు గుర్తు చేసుకున్నారు. ఉద్యోగులు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను వెంటనే చెల్లించాలని, 24గంటలపాటు విధినిర్వహణలో ఉండే ఉద్యోగులకు నగదు రహిత మెడికల్ పాలసీ అమలుచేయాలని, కాంట్రాక్టు కార్మికులకు సమానపనికి సమానవేతనం ఇవ్వాలని, కాంట్రాక్టు వ్యవస్థను రద్దుచేసి, డైరెక్టుగా జీతాలు ఇవ్వాలన్నారు. గత ప్రభుత్వంలో నియమితులైన 7,200 మంది ఎనర్జీ అసిస్టెంట్స్‌ను ఎలక్ట్రిసిటీ బోర్డు జేఎల్‌ఎంలుగా విలీనం చేయాలన్నారు. తమ డిమాండ్లను యాజమాన్యం, ప్రభుత్వం అమలు చేయకపోతే నిరసన కార్యక్రమాలు చేపడతామని కృష్ణయ్య,గోపాలరావు అన్నారు. రాష్ట్ర కార్యనిర్మాహక అధ్యక్షుడు ఎం.జగదీశ్వర్, ప్రాంతీయ మాజీ అధ్యక్షుడు కె. శ్రీనివాసులు, యం.డి. అబ్దుల్ గఫూర్, ప్రాంతీయ మాజీ కార్యదర్శి యం. శ్రీనివాసరావు , ఏపిఇపిడిసిఎల్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి యం. శ్రీనివాసులు మాట్లాడుతూ యూనియన్ సాధించిన విజయాలను కొనియాడారు. ఏపీ ట్రాన్స్‌కో ఎస్‌ఈ ఏ.గురుబాబు విద్యుత్ ఉద్యోగులు ఐక్యంగా ఉంటే డిమాండ్లను సాధించుకోవచ్చన్నారు. ప్రాంతీయ అధ్యక్ష,కార్యదర్శులు పినిపే సురేష్ బాబు,జగతా అచ్యుతరామయ్యలు మాట్లాడుతూ, ఈ ప్లాటినం జూబ్లీ వేడుకలను విజయవంతం చేసిన ఉద్యోగులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.



యూనియన్ చిహ్నం టవర్‌ను ప్రారంభిస్తున్న రాష్ట్ర అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు కృష్ణయ్య, గోపాలరావు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	20,000
గటగట (వెయ్యి)	18,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	19,000
గటగట (వెయ్యి)	17,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 – 13,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,000 – 13,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

న్యాయం చేయాలంటూ ఆందోళన

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణం కేపీ రోడ్డులో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన స్వర్ణకారుడు మాదాబత్తుల సత్తిబాబు (40) కుటుంబానికి న్యాయం చేయాలంటూ శుక్రవారం కుటుంబ సభ్యులు, సహచర స్వర్ణకార వృత్తిదారులు ఆందోళన చేశారు. మండపేట టిడ్కో గృహ సముదాయం వద్ద నివాసం ఉంటున్న సత్తిబాబు పట్టణంలోని రథం సెంటర్‌లోని స్వర్ణకార దుకాణంలో వెండి పట్టీల తయారీ పని చేస్తున్నాడు. గురువారం రాత్రి పని ముగించుకుని ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా మోటారు సైకిల్ ఢీకొట్టింది. కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం సత్తిబాబు మృతి చెందాడు. కాగా సత్తిబాబు కుటుంబానికి న్యాయం చేయాలంటూ స్వర్ణకారులు, వెండి పనివార్లు కలువ పువ్వు సెంటర్‌లో మృతదేహంతో ఆందోళన చేపట్టారు. బంగారు వర్తకుల సంఘం అధ్యక్షుడు సంకా శ్రీనివాస్ రంగా, స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు వెదురుపర్తి రామకృష్ణ ప్రసాద్, కామాక్షి వెండి పనివార్ల సంఘం అధ్యక్షుడు అడపా వాసు, వైఎస్సార్ సీపీ నాయకులు కొమ్ము రాంబాబు, పతివాడ రమణ మాట్లాడుతూ మృతికి కారకుడైన వారిపై చట్టపరిధిలో చర్యలు తీసుకోవాలని, కుటుంబాన్ని ఆదుకోవాలంటూ డిమాండ్ చేశారు. ఆందోళనకు మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి సంఘీభావం తెలిపారు. ఆందోళనకారులతో పట్టణ సీఐ సురేష్ మాట్లాడారు. ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



మండపేట కలువపువ్వు సెంటర్‌లో ఆందోళన చేస్తున్న దృశ్యం

ఏలేరు కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

రౌతులపూడి: ఏలేరు ఎడమ కాలువలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైందని రౌతులపూడి ఎస్ఐ బి.వెంకటేశ్వరరావు తెలిపారు. సుమారు 60 ఏళ్ల వయస్సు కలిగిన ఆ వ్యక్తి మృతదేహం ప్రత్తిపాడు, శంఖవరం మండలాల మీదగా వస్తున్న ఏలేరు కాలువలో కొట్టుకు వచ్చినట్లు ఆయన తెలిపారు. తెలుపురంగు మీద నలుపురంగు చారలు కలిగిన హాఫ్‌హ్యాండ్స్ గళ్ల చొక్కా, తెల్లని బనియను ధరించి వున్నడన్నారు. ఎత్తు 5.5 అడుగులు తెలుపురంగు జుత్తు, గడ్డంతో ఉన్నాడని వివరించారు. వివరాలకు రౌతులపూడి పోలీస్ స్టేషన్ సెల్ నంబర్ 70755 71014కు ఫోన్ చేయవచ్చునని వివరించారు.



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

పంట కాలువలో వ్యక్తి గల్లంతు

అమలాపురం రూరల్: మండలంలోని నడిపూడి లాకు వద్ద పంటకాలువలో ప్రమాదవశాత్తూ జారిపడి ఓ వ్యక్తి శుక్రవారం సాయంత్రం గల్లంతయ్యాడు. పోలీసులు, గ్రామ ప్రజలు తెలిపిన వివరాల ప్రకారం నడిపూడిలో శ్రీరామనగర్‌కు చెందిన సరేళ్ల సురేష్‌కుమార్ పి.గన్నవరం మండలం ముంగండలోని ఓ ఫంక్షన్‌కు వెళ్లి వస్తుండగా నడిపూడి లాకు వద్ద ప్రమాదవశాత్తూ పంటకాలువలోకి జారిపడి గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పోలీసులు, ఇరిగేషన్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. అయితే రాత్రి 9 గంటల వరకు వ్యక్తి ఆచూకీ లభ్యం కాలేదు. చీకటి కారణంగా గాలింపు ఇబ్బందిగా ఉందన్నారు.

గుర్తు తెలియని మృతదేహం వెలికితీత

రాయవరం: మండలంలోని మాచవరం వద్ద మండపేట-వెల్ల ప్రధాన కాలువలో గుర్తు తెలియని మృతదేహం కొట్టుకువచ్చింది. స్థానిక పెట్రోల్ బంకు ఎదురుగా కాలువలో మృతదేహం తేలియాడడాన్ని స్థానికులు గమనించారు. మృతదేహం బాగా ఉబ్బి ఉంది. మృతుడు నీలం రంగు షర్ట్, అండర్ వేర్ ధరించి ఉన్నాడు. రెండు మూడు రోజుల క్రితం కాలువలో పడి ఉండవచ్చునని భావిస్తున్నారు. ప్రమాదవశాత్తూ కాలువలో పడి పోయాడా..ఎవరైనా చంపి కాలువలో పడేసి ఉంటారా? అన్నది పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది. రాయవరం పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం కోసం రామచంద్రపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనుమానాస్పద స్థితిలో మృతి కేసుగా నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు రాయవరం ఎస్సై డి.సురేష్‌బాబు తెలిపారు.

మోటారు సైకిల్ చెరువులో పడి..

అల్లవరం: అల్లవరం మండలం ఎస్.పల్లిపాలెం గ్రామానికి చెందిన పెస్సింగు కామరాజు కొమరగిరిపట్నం నుంచి ఎస్.పల్లిపాలెం వస్తున్న సమయంలో మోటారుసైకిల్ అదుపుతప్పి చెరువులోకి దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అల్లవరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొమరగిరిపట్నంలో ఉపాధి పనులు నిర్వహిస్తున్న తన భార్యను తీసుకొచ్చేందుకు కామరాజు పని ప్రదేశానికి వెళ్లాడు. పని ప్రదేశంలో ఫొటో అప్‌లోడ్ కాలేదని, మీరు ఇంటికి వెళ్లండని భార్య చెప్పడంతో కామరాజు కొమరగిరిపట్నం నుంచి ఎస్.పల్లిపాలెం తిరిగి ప్రయాణం అయ్యాడు. మార్గమధ్యలో మలుపు వద్ద మోటారు సైకిల్ అదుపుతప్పి చెరువులోకి దూసుకెళ్లాడు. దీంతో కామరాజు చెరువులో తలకిందులుగా మట్టిలో కూరుకుపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. ఉపాధి పనులు ముగించుకుని వస్తున్న ఉపాధి కూలీలకు మోటారుసైకిల్ పడి ఉండడాన్ని గమనించగా చెరువులో మృతి చెంది ఉన్న కామరాజును గుర్తించి గట్టుపైకి చేర్చారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తిరుమలరావు తెలిపారు.

పట్టాలు దాటుతూ...

తుని: అన్నవరం-హంసవరం మధ్యలో పట్టాలు దాటుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని తుని జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. తుని నుంచి అన్నవరం వైపు వెళుతున్న గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో 50 ఏళ్ల వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు తెలుపు రంగు ఆఫ్ చేతుల చొక్కా, తెలుపురంగు ఫుల్ ఫ్యాంటు ధరించి ఉన్నాడని, 20 అడుగుల దూరంలో నీలంరంగు బ్యాగు.. అందులో తెలుపు రంగు దుస్తులు ఉన్నాయన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

తండ్రి మందలించాడని....

సామర్లకోట: తండ్రి మందలించాడని స్థానిక సాయినగర్‌కు చెందిన ఒక యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఇది. ఇంటర్ చదువుతున్న విద్యార్థి తేజ తండ్రి మందలించడంతో ఫ్యానుకు ఉరి వేసుకున్నాడు. ఈ విషయాన్ని గమనించిన బంధువులు వెంటనే యువకుడిని స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అయితే అప్పటికే ఆ యువకుడు మరణించినట్లు డాక్టర్లు నిర్ధారించారు. దీనిపై కేసు నమోదు కాలేదని సీఐ ఎ. కృష్ణభగవాన్ తెలిపారు.

తిరుమలలో రేపు అవగాహన సదస్సు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం తిరుమల విద్యాసంస్థల ఆధ్వర్యంలో 6,7,8,9,10వ తరగతులలోకి రాబోయే విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఐఐటీ అండ్ మెడికల్ ఫౌండేషన్‌పై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు ఓ ప్రకటనలో తెలిపారు. రాజమహేంద్రవరంలోని కాతేరు క్యాంపస్‌లో ఆదివారం ఉదయం 10గంటలకు సదస్సు జరుగుతుందన్నారు. తమ పిల్లలు భవిష్యత్తులో ఐఐటీ, ఎయిమ్స్ వంటి ప్రతిష్టాత్మకమైన జాతీయస్థాయిలో కళాశాలలలో విద్యనభ్యసించాలంటే స్కూల్ స్థాయి నుంచే ఎలా సంసిద్ధమవ్వాలో ఈ సదస్సులో వివరిస్తారని ఆయన అన్నారు. ఈ సదవకాశాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మరిన్ని వివరాలకు 79970 71672, 83090 76048 ఫోన్ నంబరులలో సంప్రదించవచ్చునని ఆయన తెలిపారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి

మలికిపురం: మండల పరిధిలోని రామరాజులంక గ్రామానికి చెందిన యువకుడు దిండిలో చెరువుల వద్ద పనిచేస్తూ విద్యుత్ షాక్‌కు గురై శుక్రవారం మృతి చెందిన వైనమిది. ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం రామరాజులంకకు చెందిన పున్నం నాగ మావుళ్లు(32) దిండిలో ఒక రైతు రొయ్యల చెరువుల వద్ద పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో చెరువు వద్ద విద్యుత్ మోటారు ఆన్ చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. దీనిని గుర్తించిన సమీప రైతు ఆర్.నరసింహారావు, బాధితుణ్ణి హుటాహుటిన అంబులెన్స్‌లో రాజోలు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి సోదరుడు బ్రహ్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎస్సై దర్యాప్తు చేపట్టారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

గోకవరం: గ్రామ శివారున నిర్వహిస్తున్న వ్యభిచార గృహంపై శుక్రవారం రాత్రి ఎస్సై పవన్‌కుమార్ ఆధ్వర్యంలో దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురు విటులతో పాటు వ్యభిచార గృహం నిర్వాహకురాలు బద్దిరెడ్డి పద్మావతి, మరో ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.